భావ విప్లవ దీపిక ! మానవవాద వీచిక !

# మానవ వికాస వేదిక

ఆంధ్ర ప్రదేశ్ (రిజిష్టర్డు నెం. 03/2005)

## పరిచయ పత్రం

మిత్రులారా !

మనమంతా సంఘ జీవులం, పరస్పర సహకారంతో జీవిస్తున్న వాళ్ళం. ఇప్పటికంటే మెరుగైన జీవితాన్ని కోరుతున్న వాళ్ళం. అటువంటి జీవితాన్ని ఏర్పరుచుకోవడానికి, ఉన్న అడ్డంకులు తొలిగితే ఎంతో బాగుంటుంది కదా! ఆ అడ్డంకులేమిటో, వాటిని తొలిగించడమెలాగో తెలిస్తే, కోరుకునేది సాధ్యమవుతుంది.

మెరుగైన సంఘ జీవితాన్ని ఏర్పరుచుకోవాలంటే ముందుగా మన మనసుల్లో వున్న కాలంచెల్లిన భావాల్ని వదిలించుకోవాలి. విశాలమైన, నూతన భావాలతో మానసికంగా వికసించాలి. దాన్నే భావవిప్లవం అంటాం. పాత కాలపు సమాజంలో ఏర్పడినవన్నీ నేటి కాలానికి సరిపడవు. ఆనాటి ఆచారాలు, ఆలోచనలు, కట్టుబాట్లు, వేషభాషలు లాంటివి ఈనాడు కుదరవనుకుంటే వదులుకుంటున్నాం కూడా! విజ్ఞానం, నాగరికత వికసించేకొద్దీ సమాజంలో విలువలు కూడా మరింత ముందుకు నడిపించగల్గుతున్నావని మనకీనాడు స్పష్టంగా తెలుస్తూనే ఉంది. 'మానవవాదం' (హ్యూమనిజం) చెప్పేది కూడా ఇదే.

మానవుడే అన్నింటికీ ప్రమాణం. మానవ సమాజాన్ని, జీవితాన్ని ప్రకృతినీ, ఇతర జీవజాలాన్ని సృజించి, శాసించే ఏ అతీంద్రియ శక్తులూ లేవు. ఈ భూమ్మీద మనం ఎలా జీవించాలో మనమే నిర్ణయించుకోవాలి. అందుకు మనం ఏం చేయాలో, ఏం చేయకూడదో, ఎలా వుండాలో, ఎలా వుండకూడదో మానవవాదం విశదపరుస్తుంది. వ్యక్తి, సమాజం వేరుకావని, ఆ రెండింటి అభివృద్ధే 'మానవ వికాస'మని మానవవాదం చెబుతుంది.

**మానవవాదం - మానవ వికాస వేదిక (మా.వి.వే) కు మూలాధారం.**

2004 సెప్టెంబర్ 12న మానవ వికాస వేదిక హైదరాబాద్‌లో ఆవిర్భవించింది. అప్పుడే కొన్ని ఆశయాలను, ఆచరణలను రూపొందించుకుని వాటి సాధన కోసం తన కృషిని కొనసాగిస్తూ ఉభయ తెలుగు రాష్ట్రాలలో సభ్యులను చేర్చుకుంటూ అనేక ప్రజోపయోగ కార్యక్రమాలు చేస్తుంది.

మెరుగైన సామాజిక జీవనం ఏర్పడాలంటే, ప్రజల మధ్య సామరస్యం, సోదరత్వం విలసిల్లాలి. పుట్టుక ద్వారా సంక్రమించే హెచ్చుతగ్గులు, సాంఘిక భేదాలు, హోదాలు నశించాలి. కులం సమాజాన్ని పీడించే ఒక మనోజాడ్యం. ప్రతి ఒక్కరి సంపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి **కులనిర్మూలన** అత్యవసరమని మా.వి.వే. అభిప్రాయపడుతోంది.

అలాగే, రుజువుల్లేని రాతలతో, దేవుళ్ళను కల్పించి, ఆత్మల పేర, పునర్జన్మల పేర, కర్మసిద్ధాంతాల పేర, పరలోకాల పేర కల్లబొల్లి కథలల్లి, వాటిని పవిత్ర గ్రంథాలుగా, పురాణ కథలుగా ప్రజల మెదళ్ళ కెక్కించి, తరతరాల నుంచి భయమూ, భక్తీ తప్ప సృజనశీలతను, సత్యాన్వేషణను సమాజంలో పెంచలేకపోయిన **మతం, ఆధునిక జీవితానికి అనవసరమని** మా.వి.వే. ఉద్దేశిస్తున్నది.

కులజాడ్యానికి, మతమౌఢ్యానికి, ఎక్కువగా బలైనవారు మహిళలే. ఆ రెండింటి ఉక్కుచట్రాలలో ఊపిరాడని బానిసత్వాన్ని భరించినందువల్లే మహిళల శక్తి యుక్తులు వేలాది సంవత్సరాల పాటు నిర్వీర్యమై పోయాయి. మత శాసనాల ద్వారా బలవంతంగా అమలైన లైంగిక అసమానతల వల్లనే సమాజ పురోగతి అసాధ్యమయింది. కనుక ఇప్పటికైనా మహిళలకు అన్నింటా **సమాన అవకాశాలు, సాధికారత** లభించాలని ఆశిస్తూ దానికై కృషి చేస్తుంది మా.వి.వే.

సంఘజీవితమంటే సంస్కృతిక అంశాలే. కులం, మతం, భూస్వామ్యం, రాచరికం, విదేశీయత వంటి ఆధిపత్య శక్తులే సంస్కృతిని, జీవన విలువల్ని నిర్ణయించి, తమ ప్రయోజనాలను నెరవేర్చుకున్నాయి. ఫలితంగా అవినీతి, అక్రమార్జన, అశ్లీలత వంటి అనైతిక అంశాలు కూడా విలువలుగా నేటికీ చలామణి అవుతున్నాయి. సహనం, సహకారం, శీలం, ప్రేమ, కరుణ వంటి మానవీయ విలువలకు చోటు లేకుండా పోతోంది. కనుక సమాజం మెరుగ్గా ఉండాలంటే **మానవీయ సంస్కృతి, విలువలు** వెలుగులీనాలని మా.వి.వే అభిలాషిస్తున్నది.

ప్రతి ఒక్కరికీ జీవించే హక్కు సహజంగా వస్తుంది. సంఘం పట్ల తన బాధ్యతలను నిర్వహిస్తూనే హక్కుల్ని